క్లుప్తంగా

ఆత్మీయ కలయిక



వైఎస్సార్‌సీపీ అధినేతతో మండల కన్వీనర్ వాసు, ఆయన కుమారుడు గణేష్

ద్వారకాతిరుమల: ప్రజలకు అండగా ఉండాలని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని ఆ పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు గురువారం తెలిపారు. తాడేపల్లిలోని నివాసంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తన కుమారుడు గణేష్‌తోపాటు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసినట్టు చెప్పారు.

4 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

లింగపాలెం: ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు పరీక్షలు రాసేందుకు లింగపాలెం మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాలు కేటాయించినట్లు ఎంఈవో కె.రామారావు తెలిపారు. గురువారం ఎంఈవోలు రామారావు, రవీంద్ర ఆయాగ్రామాలలోని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఈ మేరకు రామారావు మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూల్స్‌లో చదువుతున్న సుమారు 500 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. వీరు పరీక్షలు రాసేందుకు మండలంలోని రంగాపురం, శింగగూడెం, ధర్మాజీగూడెం జెడ్పీ హైస్కూల్స్‌తో పాటు ధర్మాజీగూడెంలోని హోలీట్రినిటీ హైస్కూల్‌ను పరీక్షా కేంద్రాలుగా కేటాయించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తామన్నారు.

ముగిసిన సత్య సాయి సప్తాహం

కొయ్యలగూడెం: భగవాన్ శ్రీసత్య సాయిబాబా అఖండ నామ యజ్ఞ సప్తాహ కార్యక్రమం ముగిసినట్లు నిర్వాహకులు సత్తిబాబు గురువారం పేర్కొన్నారు. సత్యసాయి నగర్‌లోని ఉన్న బాబా వారి మందిరంలో బుధవారం సాయంత్రం ఆరు గంటల నుంచి సప్తాహం ప్రారంభం అయిందన్నారు. గురువారం సాయంత్రం ఆరు గంటల వరకు ఇరవై నాలుగు గంటల పాటు శ్రీసత్య సాయి నామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో వందమందికి పైగా భక్తులు అఖండ నామ సంకీర్తనలో పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

కుక్కునూరు: మండలంలోని వేలేరు గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూముల్లో గురువారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వేలేరు సమీపంలోని సర్వే నంబర్ 179లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించే దిశగా స్థానికులు కొందరు ప్రభుత్వ భూమిలోని చెట్లను నరుకుతుండగా సమాచారం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. అంతేకాక ఆ భూముల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ విషయమై తహసీల్దార్ రమేష్‌బాబు మాట్లాడుతూ రెవెన్యూ భూముల జోలికి వస్తే కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్వో సాయి, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటన జంగారెడ్డిగూడెంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొయ్యలగూడెం మండలం మంగపతిదేవిపేట గ్రామంలో వీఆర్వోగా పని చేస్తున్న షేక్ మక్బుల్ జంగారెడ్డిగూడెంలో మోటార్ సైకిల్‌పై వెళుతుండగా, ఎదురుగా వస్తున్న మరో మోటార్ సైకిల్ ఢీకొట్టిందన్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మక్బుల్ స్థానిక ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి, అనంతరం విజయవాడ ఆంధ్ర ఆసుపత్రికి తరలించారన్నారు. ఈ మేరకు బాధితుడి కుటుంబ సభ్యుడు షేక్ బాజీ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దాడి కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఒక వ్యక్తి మరో వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో బాధితుడు తడికమళ్ల శివ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. తడికమళ్ల శివ పొగాకు పనులు చేస్తుంటాడని, ఈ నెల 2వ తేదీన తాడువాయి తిరునాళ్లకు బంటా సభ్యులతో కలిసి శివ వెళ్లాడన్నారు. సొమ్ములు అవసరమై బంటా మేస్త్రీ మొయేటి శ్రావణిని శ్రీను అడిగాడు. శ్రావణి డబ్బులు ఇస్తుండగా, శ్రావణి భర్త మొయేటి మధు అడ్డుకుని శ్రీనుతో గొడవ పడ్డాడు. అనంతరం తిరునాళ్లు ముగించుని ఇంటికి వెళుతుండగా, శ్రీనును వెనుక నుంచి మధు నరికేందుకు యత్నించాడు. ఈ ఘటనలో శ్రీను తలకు, కుడి చేతి వేలుకు గాయాలయ్యాయి. వెంటనే బంటా సభ్యులు శ్రీనును జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో శ్రీను గురువారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్

కుక్కునూరు: స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు 100, 112 టోల్ ఫ్రీ నంబర్ల వలన ఉపయోగాలు, వీటితో రక్షణ పొందే అంశాలను వివరించారు.

వీధి కుక్కలతో ప్రజల బెంబేలు

- చుక్కలు చూపిస్తున్న వీధి శునకాలు
- గ్రామాల్లో విచ్చలవిడిగా సంచరిస్తూ దాడి
- అరికట్టాలని కోరుతున్న గ్రామస్తులు



రోడ్డుపై విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధి కుక్కలు

లింగపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున కుక్కలు స్వైర విహారం చేస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామాల్లోని ప్రతి వీధిలోనూ పదుల సంఖ్యలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ద్విచక్ర వాహనాల మీద వెళ్లే వారిని, చిన్ని పిల్లలను వెంటపడి కరుస్తున్నాయి. కుక్కలు కనబడితే చాలు అవి ఎక్కడ మీద పడి కరుస్తాయోనని పిల్లలు, పెద్దలు బెంబేలెత్తిపోతున్నారు. కుక్కలు కరిస్తే రేబిస్ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నందున తమ ప్రాంతంలోని కుక్కలను పట్టుకెళ్లమని ఫిర్యాదులు చేసే వారి సంఖ్య పెరిగి పోతోంది. వీధుల్లో స్వైర విహారం చేస్తూ పిల్లలు, పెద్దలను పట్టి కరుస్తూ భయాందోళనకు గురి చేస్తున్న కుక్కలను నియంత్రించేందుకు గ్రామ సచివాలయ కార్యదర్శులు తీసుకున్న చర్యలు ఏమాత్రం సత్ఫలితాలను ఇవ్వడం లేదని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొంత కాలంగా గ్రామాల్లో కుక్కలను వలలు వేసి పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలి వేసే కార్యక్రమం గాని ఆపరేషన్లు గాని చేసినట్టు కన్పించలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కుక్కలతో భయం

ఏదైనా పని మీద బయటకు రావాలంటేనే భయంగా ఉంది. నడుచుకుని వెళుతున్నా, స్కూటర్ మీద వెళ్లినా దాడులు చేస్తున్నాయి. వీధుల్లోకి రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

–కె.వెంకటేశ్వరరావు, ధర్మాజీగూడెం

గాయాల పాలవుతున్న పిల్లలు

కుక్కల దాడిలో చిన్నపిల్లలు ఎక్కువగా గాయాల పాలవుతున్నారు. ఇటీవల కుక్కల వల్ల గాయపడిన ఘటనలు పదుల సంఖ్యలో ఉన్నాయి. మండలంలో రెండు నెలలుగా చూస్తే సుమారు 93 మంది కుక్కల వల్ల గాయాలపాలైనట్టు ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు పలువురు అధికారులకు మొర పెట్టుకుంటున్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

జంగారెడ్డిగూడెం: రక్తదానం చేయడం వలన మరో ప్రాణాన్ని కాపాడుకోవచ్చని, కావున ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం అలవాటుగా చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు అన్నారు. స్థానిక ఛత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్ రిబ్బన్ క్లబ్, జువాలజి డిపార్ట్‌మెంట్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1, 2 ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ ఏలూరు వారిచే రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ తల సేమియా బాధితులు చాలా ఇబ్బంది పడుతున్నారని అలాంటి వారికి మనం దానం చేసిన రక్తం ఉపయోగపడుతుందన్నారు. కళాశాల నుంచి 29 మంది విద్యార్థులు, అధ్యాపకులు రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వి.హనుమంతరావు, ఎస్వీ రమణ, జి.వెంకట్‌లాల్, టి.ఝాన్సీరాణి, డాక్టర్ గల్లా శ్రీనివాసరావు, నిట్టా వినయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



పట్టుబడిన వాహనంలో ఉన్న పశువులు

బుట్టాయగూడెం: అక్రమంగా పశువులను తరలిస్తున్న ఒక వాహనాన్ని తనిఖీల్లో పట్టుకున్నట్లు జీలుగుమిల్లి ఎస్సై పి.నవీన్‌కుమార్ గురువారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో పాటు వీఆర్వో, వీఆర్‌ఏలతో వాహనాలు తనిఖీ చేస్తుండగా జంగారెడ్డిగూడెం వైపు నుంచి హైదరాబాద్ వెళుతున్న టీఎస్ 12యూఈ 2007 నంబరు గల లారీని డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోవడానికి ప్రయత్నం చేశాడన్నారు. ఆ సమయంలో దానిని పట్టుకుని వీఆర్వో, వీఆర్‌ఏల సమక్షంలో లారీని తనిఖీ చేయగా అందులో ఎటువంటి రసీదులు లేకుండా తరలిస్తున్న 83 పశువులను గుర్తించామని చెప్పారు. వీటిలో 8 ఆవులు, 75 ఎద్దులకు నీరు, గడ్డి లేకుండా తీసుకెళుతున్నట్లు గుర్తించామన్నారు. ఇది నేరమని చెప్పారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా విజయనగరం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నామని చెప్పినట్లు తెలిపారు. అయితే ఈ వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. అలాగే ఈ పశువులను విజయవాడ దగ్గర నున్నలో గోశాలకు తరలించినట్టు చెప్పారు.

ఆశ కార్యకర్తల అక్రమ అరెస్ట్ అప్రజాస్వామికం



మానవహారం చేస్తున్న నాయకులు

పోలవరం రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఆశ కార్యకర్తలను అక్రమ అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని సీపీఎం పోలవరం మండల కార్యదర్శి కారం భాస్కర్ అన్నారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన విజయవాడ మహా ధర్నాకు వెళ్లనీయకుండా ఎక్కడికక్కడ అక్రమ అరెస్టులు చేయడం ప్రభుత్వ దుర్మార్గపు చర్యని అన్నారు. అక్రమ అరెస్టులను ఖండిస్తూ గురువారం ఏటిగట్టు సెంటర్ వద్ద ఆశ కార్యకర్తలు మానవహారంగా నిరసన చేపట్టారు. అనంతరం సీఐటీయూ జిల్లా నాయకులు సీహెచ్ కుసుమ, మండల కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడుతూ విజయవాడ ధర్నాకు అనుమతి ఇచ్చి సమస్యలతో బాధపడుతున్న వారిని ధర్నాకు వెళ్లకుండా పోలీసులతో అడ్డుకోవడం ప్రభుత్వానికి సరైంది కాదన్నారు. ఆశ కార్యకర్తల న్యాయమైన డిమాండ్స్ పరిష్కారం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించాలని అరెస్ట్ చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.వెంకటలక్ష్మి, బి.నాగలక్ష్మి, జయలక్ష్మి, శ్యామలత, చెల్లారత్నం, వీరమణి, దుర్గా, సునీతా, విజయకుమారి, తామ బాలరాజు, ఎస్.సాయికృష్ణ, సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మహా ధర్నాకు తరలిరావాలి



పీఓ కృష్ణకుమారికి వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కుక్కునూరు: అంగన్‌వాడీల వేతనాల పెంపు, గ్రాడ్యుటీ అమలు, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేయాలని కోరుతూ మార్చి 10వ తేదిన విజయవాడలో చేపట్టనున్న మహా ధర్నాకు అంగన్‌వాడీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు కారం దారయ్య పిలుపునిచ్చారు. గురువారం కుక్కునూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో దారయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే అంగన్‌వాడీ సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చినట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 8 నెలలు గడుస్తున్న ఇంతవరకు హామీల అమలు దిశగా చర్యలు చేపట్టిన పాపనపోలేదని విమర్శించారు. అనంతరం సమస్యలపై పీఓ కృష్ణకుమారికి వినతి పత్రాన్ని అందించారు. సమావేశంలో ఏఐటీయూసీ మండల కన్వీనర్ కొన్నె లక్ష్మయ్య, యూనియన్ లీడర్లు వెంకటేశ్వరి, చందా రమాదేవి, కుంజా వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ తోటలో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న ఎస్సై నవీన్‌కుమార్, సిబ్బంది

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం పాకలగూడెం సమీపంలోని ఒక పామాయిల్ తోటలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. తీవ్రమైన ఎండతో పాటు వేడి గాలులు కూడా వీయడంతో తోటలో మంటలు ఒక్క సారిగా వ్యాపించాయి. సమాచారం అందుకున్న జీలుగుమిల్లి ఎస్సై నవీన్ కుమార్ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఆ సమయంలో స్థానికులు కూడా సహకరించడంతో భారీ నష్టం జరగకుండా నివారించారు. అయితే ఆ సమయంలో జంగారెడ్డిగూడెం అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేసినప్పటికీ ఆ వాహనం అందుబాటులో లేదని స్థానికులు తెలిపారు. అయితే ఎస్సై నవీన్‌కుమార్‌తో పాటు సిబ్బంది, స్థానికులు బకెట్లతో నీరుపోసి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదానికి కారణాలను తెలుసుకునేందుకు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందున అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయంలో డయల్ 112, లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు.

తాగునీటి కోసం మహిళల నిరసన



తాగునీటి కోసం నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

కొయ్యలగూడెం: తాగునీటి సమస్య పరిష్కరించాలని మహిళలు గురువారం ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. గవరవరం–వెంకయ్యపాలెం రోడ్డులోని వెంకటరావుపేటలో గత పది రోజులుగా మంచినీటి సౌకర్యం లేకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. పంచాయతీ ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు సమీపంలోని వర్జీనియా పొగాకు పనుల నిమిత్తం వచ్చిన కూలీలకు మళ్లించడంతో సమస్య ఏర్పడిందన్నారు. ఓ వైపు విద్యుత్ కోతలు వలన సరిపడా తాగునీరు సరఫరా అవ్వడం లేదన్నారు. ఆర్వో వాటర్ ప్లాంట్ల ద్వారా వస్తున్న నీటిని కొనుగోలు చేస్తున్నారని ఆర్థిక స్తోమత లేని తాము తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యను పరిష్కరించాలని పంచాయతీ అధికారులకు విన్నవించారు. కాగా తాగునీటి సమస్యపై ఆందోళన చేస్తున్న మహిళలకు సీపీఐ మండల కన్వీనర్ టి.ఆంజనేయరాజు శ్రేణులతో కలిసి మద్దతు పలికి ఆందోళనలో పాల్గొన్నారు.

వర్మీకంపోస్టు తయారీకి చర్యలు చేపట్టాలి



వానపాములను విడుదల చేస్తున్న ఈవోపీఆర్‌డీ రత్నకుమార్

లింగపాలెం: ప్రతి గ్రామ పంచాయతీలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ ద్వారా వర్మీకంపోస్ట్ ఎరువులు తయారీకి చర్యలు చేపట్టాలని లింగపాలెం మండల పంచాయతీ జేవీ విస్తరణాధికారి రత్నకుమార్ కార్యదర్శులకు తెలిపారు. గురువారం కొణిజర్ల గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో వానపాములను గ్రామ సర్పంచ్ ఎన్.జయశ్రీ ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శి జశ్వినిత, ఈవోపీఆర్‌డీ విడుదల చేశారు. ఈ సందర్భంగా రత్నకుమార్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ కమిషనర్, కలెక్టర్, డీపీవో వారి ఆదేశాల మేరకు మండలంలోని అన్ని పంచాయతీల్లో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లలో వర్మీకంపోస్ట్ ఎరువుల తయారు చేసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు ఆదేశించారు. గ్రామాల్లో తడి చెత్త, పొడిచెత్తను సేకరించి ఈ షెడ్ వద్ద కుళ్లబెట్టి అనంతరం గ్రేడింగ్ చేసిన చెత్తను తొట్టిల్లో వేసి ఆపై వానపాములను విడుదల చేస్తే వర్మీకంపోస్ట్ ఎరువు తయారవుతుందన్నారు. మండలంలో 22 పంచాయతీల్లో ఈషెడ్లు ఉన్నాయన్నారు. ఇప్పటికే కొన్ని షెడ్లలో వర్మికంపోస్టు ఎరువులు తయారు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ చొదిమళ్ల విజయ భాస్కరరావు, ప్రభుదాసు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కూటమి హామీలు నెరవేర్చాలి



కొయ్యలగూడెం: వినతిపత్రం అందజేస్తున్న సర్వ శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు

కొయ్యలగూడెం: కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలి అంటూ సర్వ శిక్ష అభియాన్ సిబ్బంది గురువారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఆర్ పాలసీ, మినిమం ఆఫ్ టైం స్కేల్, వేతనాల పెంపు, ఈపీఎఫ్ అమలు, ఇతర విషయాలపై ఎన్నికల సందర్భంగా కూటమి నాయకత్వం తమకు స్పష్టమైన హామీ ఇచ్చిందన్నారు. అయితే పాలనలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా పట్టనట్టు ప్రభుత్వం వ్యవహరించడం తమని మోసం చేయడమేనని ఆరోపించారు. ఎ.సత్యనారాయణ, సీహెచ్ బాలకృష్ణ, వై.దుర్గామహేశ్వరి, ఎం.వీరస్వామి, పి.నరసింహం, ఎం.శ్రీనివాసరావు, ఎం.జ్యోతిప్రకాష్, కె.పోశమ్మ, కె.ధనలక్ష్మి, డి.లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కుక్కునూరు: సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం భోజన విరామ సమయంలో సిబ్బంది నిరసన చేపట్టారు. పోతురాజు, లావణ్య, సుశీల, సునీత, ప్రమీల పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల: నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ద్వారకాతిరుమలలో

ద్వారకాతిరుమల: స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగులు గురువారం నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

కిశోర బాలికలకు అవగాహన సదస్సు



మొక్కలు నాటుతున్న బాలిక

కొయ్యలగూడెం: అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా గురువారం పొంగుటూరు గ్రామంలో ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ పీఓ తులసి పర్యవేక్షణలో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి వారిలో ఆత్మస్థైర్యం నింపుకునే అంశాలపై అవగాహన కల్పించారు. బ్యాంకర్ల ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకునే విధానంపై సీపీఎల చేత డ్వాక్రా మహిళలకు, కిశోర బాలికలకు అవగాహన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలుచోట్ల అంగన్‌వాడీ సిబ్బంది, కిశోర బాలికల చేత ఒక్కరు ఒక మొక్క నాటే విధంగా కార్యక్రమం చేసి గ్రామస్తులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ర్యాలీ నిర్వహిస్తూ మహిళలు తీసుకునే జాగ్రత్తలపై కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంబటి సరస్వతి, కె.రాణీరత్నం, పి.లక్ష్మి, పి.జ్యోతి, ఎం.మాధవి, పి.రోజా మణి పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై పీవోకు ఫిర్యాదు



ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

బుట్టాయగూడెం: మండలంలోని రాజానగరం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు గురువారం ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీచర్ల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు మొడియం గంగరాజు మాట్లాడుతూ రాజానగరం ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు విద్యార్థులను, అక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయురాలను, విద్యార్థుల తల్లిదండ్రులను జాతి వివక్ష చూపుతూ అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పీవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే కొండరెడ్ల సంఘం ఆధ్వర్యంలో కూడా పీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాయం పోసియ్య, సోదెం రాజు, చిర్రి దేవరాజు, కంగాల వెంకటేశ్వరరావు, కొండరెడ్ల సంఘం నాయకులు వేట్ల ముత్యాలరెడ్డి, నడపల సోమరాజు, కె.ప్రతాపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన కంకిపాటి చక్రి శ్రీరామ్ ఫైనాన్స్‌లో పని చేస్తున్నాడు. ఫిబ్రవరి 28వ తేదీన ఉద్యోగానికి వెళ్లిన చక్రి ఇంటికి వెళ్లలేదు. చక్రి భార్య పూనెం నాగదుర్గ స్థానిక సంగీత్ మొబైల్స్‌లో ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తుంది. అదే రోజు పని ముగించుకుని ఇంటికి వెళ్లి నాగదుర్గకు భర్త చక్రి కనిపించకపోవడంతో చుట్టు పక్కల వెతికింది. గురువారం వరకు అతని ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేసిందన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేసవిలో పక్షుల దాహార్తి తీరుస్తూ..



పాత్రల్లో నీటిని నింపుతున్న జాకీర్ హుస్సేన్

టి.నరసాపురం: వేసవిలో పక్షుల దాహార్తిని తీర్చడం మంచి కార్యక్రమమని, దీనికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పర్యావరణ పరిరక్షకుడు, వన సంరక్షణ సమితి సభ్యుడు, రాణా వెల్ఫేర్ సొసైటీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్ అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పక్షుల సంరక్షణకు తన వంతు హుస్సేన్ నడుం బిగించారు. వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో బండివారిగూడెంలో ఉపయోగంలో లేని వస్తువులతో పలు ప్రదేశాల్లో నీరు నింపి పక్షుల దాహార్తి తీరుస్తున్నారు. ఈ విధంగా పక్షులకు, మూగ జీవాలకు దాహార్తిని తీర్చి నలుగురికి మార్గదర్శకంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ రాణా వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంక సాంబశివరాయల్ స్ఫూర్తితో స్వచ్ఛందంగా మూగ జీవాల ప్రాణాలను కాపాడుతూ పక్షుల దాహార్తి తీరుస్తున్నట్లు ఆయన తెలిపారు. పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం

బుట్టాయగూడెం: మండల కేంద్రమైన జీలుగుమిల్లిలో కొలువైన జగదాంబ అమ్మవారి 68వ ఆలయ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాగా ఈ జాతర మహోత్సవాలు నేటి నుంచి 12వ తేదీ వరకూ జరగనున్నాయి. ఆంధ్రా, తెలంగాణ సరిహద్దులో నిర్వహిస్తున్న ఈ తిరునాళ్లలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. కాగా ఈ ఉత్సవాల్లో ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మున్సిపాలిటీలో ఆశీల వేలం



ఆశీల వేలం నిర్వహిస్తున్న కమిషనర్, రెవెన్యూ అధికారులు

జంగారెడ్డిగూడెం: మున్సిపాలిటీలో 2025–26 సంవత్సరానికి గాను వారపు సంత, రోజువారీ మార్కెట్, కబేళాకు ఆశీల వసూలు కోసం గురువారం వేలం నిర్వహించారు. కమిషనర్ కేవీ రమణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్.సుబ్బారావు వేలం నిర్వహించగా రోజువారీ, వారపు సంతకు ఆశీల వసూలుకు వేలంలో రూ.33,12,000 ఆదాయం లభించింది. గంటా వెంకట సూర్యనారాయణ బహిరంగ వేలంలో దక్కించుకున్నారు. కాగా ఈ రూ. 33,12,000లకు 12శాతం జీఎస్టీ, మరో రూ.10 లక్షలు మార్కెట్ క్లీనింగ్ నిర్వహణకు పాటదారుడు చెల్లించాల్సి ఉంటుందని అధికారులకు తెలిపారు. కాగా గత సంవత్సరం వారపు సంత, డైలీ మార్కెట్‌కు రూ.32.05 లక్షలు లభించింది. అలాగే కబేళా ఆశీల వసూలుకు రూ.1.75 లక్షలు లభించగా, ఎస్‌హెచ్ ప్రసాద్ వేలంలో పాటను దక్కించుకున్నారు. గత ఏడాది కబేళాకు రూ.1.54 లక్షలు ఆదాయం వచ్చింది.

సాగు పట్టాలు ఇవ్వాలి

టి.నరసాపురం: మండలంలో ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న పేదలకు సాగు పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు బీఎన్ సాగర్ డిమాండ్ చేశారు. మండలంలోని కేతవరం, అల్లంచర్ల రాజుపాలెం, ఏపుగుంట పంచాయతీల్లో పేదలు ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్నారన్నారు. భూములపై పేదలకు సాగు పత్రాలు ఇప్పించాలని కోరారు.